## క్లుప్తంగా

### సన్మానం



మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న రఘువీర్‌రెడ్డి

**మన్సూరాబాద్:** నిరుద్యోగ యువతీయువకుల సంక్షేమమే ధ్యేయంగా ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి మంత్రిని, ఎమ్మెల్యేని ఘనంగా శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన ప్రజాప్రతినిధులకు, స్టాళ్లు ఏర్పాటు చేసిన కంపెనీ ప్రతినిధులకు, వలంటీర్లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్, సిద్దగోని జగదీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు అప్రజాస్వామికం

**హస్తినాపురం:** ప్రగతిభవన్‌పై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అప్రజాస్వామికమని కార్పొరేటర్ విద్యానియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రగతిభవన్‌ను పేల్చేయాలని అనడం హింసను ప్రేరేపించేలా ఉందన్నారు. రాజకీయాల్లో ఉన్న వారు ప్రజలలో శాంతి, విలువలను పెంపొందించేందకు కృషి చేయాలని సూచించారు. తాము అధికారంలోకి వస్తే విద్యా, వైద్యంలో ఎలాంటి మార్పులు చేస్తారో ఎప్పుడూ చెప్పని రేవంత్ ప్రగతిభవన్‌ను పేల్చేస్తారని చెప్పడంలో ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు.

### ఘనంగా ‘భాష్యం’ ఫేర్‌వెల్ సంబురం



సందడి చేస్తున్న విద్యార్థినులు

**వనస్థలిపురం:** వనస్థలిపురంలోని భాష్యం పాఠశాల విద్యార్థులు శనివారం స్థానిక కినారా గ్రాండ్ కాన్ఫరెన్స్ హాల్‌లో వీడ్కోలు (ఫేర్‌వెల్) వేడుకను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటలతో సందడి చేశారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు సన్మానించారు. పాఠశాల జోనల్ ఇన్‌చార్జి బి.అంకమ్మరావు, ప్రిన్సిపాల్ సుజాత తదితరులు రాబోయే పదవ తరగతి పరీక్షల్లో అత్యున్నత ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు.

### నిరంతర వ్యాయామంతో పరిపూర్ణ ఆరోగ్యం

ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి



ఏసీపీ శ్రీధర్‌రెడ్డి సన్మానిస్తున్న నిర్వాహకులు

**చంపాపేట:** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రమం తప్పకుండా చేసే వ్యాయామంతోనే మానసిక, శారీరక దృఢత్వంతో పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా రూపుదిద్దుకుంటారని ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ పవన్‌పురి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన అల్టిమేట్ ఫిట్‌నెస్ స్టుడియోను శనివారం ఆయన ఇన్‌స్పెక్టర్ సీతారాంతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ కార్యదర్శి కొండా యాదగిరి, అశ్విన్, క్రాంతి, శ్యామ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

**చంపాపేట:** చంపాపేట డివిజన్ దుర్గానగర్ కాలనీలోని సుమారు రెండు వందల సంవత్సరాల చరిత్ర గలిగిన శివాలయ ప్రాంగణంలో మహాగణపతి, సుబ్రహ్మణ్య, నవగ్రహ, ఆలయ ధ్వజ స్తంభ, నందీశ్వర సామివారి విగ్రహ ప్రతిష్ఠ శనివారం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆలయ పునరుద్ధరణకు శక్తి వంచనలేకుండా సహాయ, సహకారాలు అందిస్తానని స్పష్టం చేశారు. ఆలయ నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శివాలయ నిర్వాహకులు సోమన్న, రామలింగయ్య, దయానంద్, తిరుపతిరెడ్డి, మోహన్, శేఖర్, సుదర్శన్, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు మణిపాల్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మెగా జాబ్‌మేళాకు మంచి స్పందన

- తరలివచ్చిన నిరుద్యోగ అభ్యర్థులు
- మేళాలో పాల్గొన్న 108 కంపెనీలు
- అర్హులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు



అపాయింట్‌మెంట్ ఆర్డర్లు తీసుకున్న అభ్యర్థులతో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**హుడాకాంప్లెక్స్:** నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ధ్రువ కన్సల్టెన్సీ సర్వీసెస్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాకు నిరుద్యోగ యువత నుంచి విశేష స్పందన లభించింది. యువజన, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మేళాను ప్రారంభించారు. గ్రేటర్ జిల్లాల నుంచి 30 వేల మందికిపైగా ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో అత్యధికంగా యువతులే ఉండటం విశేషం. మొత్తం 108 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొన్నాయి. ప్రతిభ కనబర్చిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. రూ. 15 వేల నుంచి రూ. 50 వేల వేతనం ప్రకటించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం అకస్మాత్తుగా వీచిన ఈదురు గాలికి షామియానాలు కూలిపోగా అధికారులు, పోలీసులు వెంటనే అప్రమత్తమై సరిచేశారు. ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు యెగ్గె మల్లేష్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

**ఉపాధి కల్పిస్తాం**

మారుతున్న కాలానుగుణంగా భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తేనే ఇల్లు గడుస్తుంది. భవిష్యత్తులో దివ్యాంగులకు ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహిస్తాం. చదువుకు చేసే ఉద్యోగానికి సంబంధం లేకుండా చాలా మంది పని చేస్తున్నారు. వారందరికీ ఆయా అంశాల్లో వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పిస్తాం. ఎల్బీనగర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తాం.

– శ్రీనివాస్‌గౌడ్, మంత్రి

**అవకాశాలు కల్పిస్తాం**



జాబ్‌మేళాలో భాగంగా పాల్గొన్న 108 కంపెనీల్లో 13 వేల మందికి ఉద్యోగావకాశాలు ఉన్నాయి. 30 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 16 జాబ్‌మేళాలు నిర్వహిస్తే అత్యధికంగా ఎల్బీనగర్ జాబ్‌మేళాకే అభ్యర్థులు హాజరయ్యారు. ఈ జాబ్ మేళాలో అవకాశాలు రాని వారికి భవిష్యత్తులో కల్పిస్తాం.

– సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్యే, ఎల్బీనగర్

**కుటుంబ పోషణ కోసం..**



బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేశా. నా భర్త కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. ఒక్కడి సంపాదనతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. భర్తకు తోడుగా ఉండాలని భావించాను. చదివిన చదువుకు తగిన ఉద్యోగం దొరుకుతుందనే ఆశతో వచ్చాను.

– కవిత, తుర్కయంజాల్

**ఆనందంగా ఉంది**



బీఎస్సీ ఎంఎస్‌సీఎస్ కోర్సు పూర్తి చేశాను. ఉద్యోగం కోసం ఇప్పటికే చాలా కంపెనీల్లో ప్రయత్నించినా రాలేదు. ఇక్కడ నిర్వహించిన జాబ్‌మేళాలో బీజెడ్‌ఫైనాన్స్ సర్వీసెస్‌లో ఉద్యోగం వచ్చింది. జాయినింగ్ లెటర్ కూడా ఇచ్చారు. ట్రైనింగ్‌లో నెలకు రూ. 11 వేల వేతనం అన్నారు. చాలా ఆనందంగా ఉంది.

– స్వాతి, సరూర్‌నగర్

**ఫోన్ చేస్తామన్నారు**



బీకాం కంప్యూటర్స్ పూర్తి చేశాను. మన్సూరాబాద్‌లోని దివ్యాంగుల హాస్టల్లో ఉంటున్నాను. ఉద్యోగం కోసం అనేక చోట్ల ప్రయత్నించా. అయినా ఫలితం లేకుండా పోయింది. మరోసారి ప్రయత్నిద్దామని ఇక్కడికి వచ్చాను. రెస్యూమ్ ఇచ్చాను. ఫోన్ చేసి చెబుతామన్నారు.

– జగన్, దివ్యాంగుడు

## పాత గ్రామంలో వసతుల కల్పనకు కృషి



హయత్‌నగర్ పాత గ్రామవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్:** హయత్‌నగర్ పాత గ్రామంలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని, ధ్వంసమైన డ్రైనేజీ, రోడ్లను తిరిగి నిర్మిస్తామని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన కాస్‌బాగ్, గుడాల బస్తీ, చాకలి బస్తీలలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దశాబ్దాల క్రితం నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు ఉన్నాయయని చాలా చోట్ల అవి ధ్వంసం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. చాలా బస్తీలలో మంచి నీటి లో ప్రెషర్ సమస్య ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికే పాత గ్రామంలో రెండు చోట్ల సీసీ రోడ్లను వేశామని ఆయా సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈ నరేంద్రతేజ తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం

- రంగారెడ్డి జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి హరేకృష్ణ భూపతి





మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి హరేకృష్ణ భూపతి

**రంగారెడ్డి జిల్లా కోర్టులు:** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాలలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హరేకృష్ణ భూపతి మాట్లాడుతూ... కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయం పొందాలని సూచించారు. లోక్ అదాలత్ వేదిక ద్వారా కుటుంబ తగాదాలతో విడిపోయిన నాలుగు జంటలను కలిపి వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపి సంతోషంగా జీవించాలని సూచించారు. కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి ఆర్. తిరుపతి, రంగారెడ్డి జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు శ్రీ.జి.సుధాకర్ రెడ్డి, డీసీపీ సాయిశ్రీ, పబ్లిక్ పాసిక్యూటర్ కస్తూరి బాయ్, ఏపీపీ రాజిరెడ్డి, సునిత బర్ల, న్యాయమూర్తులు, న్యాయవాదుల, పారా లీగల్ వలంటీర్స్, కక్షిదారులు పాల్గొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి/సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఎ.శ్రీదేవి తెలిపిన వివరాల ప్రకారం శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టు ప్రాంగణాలలో 20 లోక్ అదాలత్ బెంచిలలను ఏర్పాటు చేశామన్నారు. అందులో రాజీకి ఆమోద యోగ్యమైన 81634 క్రిమినల్ కేసులు, 180 సివిల్ కేసులు, మోటారు వాహన ప్రమాదబీమా కేసులు, 469 బ్యాంకు రికవరీ, ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. కక్షిదారులకు మొత్తంగా రూ. 6,45,75,810 వరకు నష్ట పరిహారం చెల్లించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 82,283 కేసులు పరిష్కారంతో రాష్ట్ర వ్యాప్తంగా మొదటి స్థానంలో రంగారెడ్డి జిల్లా నిలిచిందని వెల్లడించారు.

## ఘనంగా ‘నాగార్జున’ వార్షికోత్సవం



వేడుకలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

**వనస్థలిపురం:** వనస్థలిపురంలోని నాగార్జున మాంటిస్సోరి, ఐఐటీ ఒలింపియాడ్ పాఠశాల 32వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం రాత్రి స్థానిక ఛత్రపతి శివాజీ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. గత ఏడాది పదవ తరగతి పరీక్షల్లో జీపీఏ 10 సాధించిన 29 మంది విద్యార్థులకు రూ. 5 వేల చొప్పున నగదు బహుమతులు, మెమోంటోలు ప్రదానం చేశారు. నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్ రెడ్డి మాట్లాడుతూ... నూతన సీసీఈ పద్ధతిలో విద్యా బోధన చేస్తున్నందున పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామన్నారు. తమ విద్యార్థులు జాతీయస్థాయి పోటీ పరీక్షలలో నెగ్గి ఐఐటీ, మెడిసిన్ సీట్లను సాధించారని అన్నారు. వైస్ చైర్‌పర్సన్ రజనీ విఠల్‌రెడ్డి, సీఏఓ శేషారావు, డీన్ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు

- ఆక్రమణదారులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తాం
- ఉప్పల్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్



మాట్లాడుతున్న ఉప్పల్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్

**నాగోలు:** ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటమాని, పదే పదే ఆక్రమణలకు ప్రయత్నిస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని ఉప్పల్ తహసీల్దార్ కె.గౌతమ్‌కుమార్ హెచ్చరించారు. నాగోలు డివిజన్ బండ్లగూడ గ్రామ శివారు ప్రభుత్వ భూమి సర్వే నెం.36 ఫతుల్లాగూడ గ్రామానికి సంబంధించిన సర్వే నెం.58లోని సుమారు 3 ఎకరాల భూమిలో అక్రమంగా నిర్మించుకున్న సుమారు 50 గుడిసెలను శనివారం ఎల్‌బీనగర్ పోలీసుల సాయంతో రెవెన్యూ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ... ఇక్కడి భూమిని ప్రజల సౌకర్యార్థం వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజల అవసరాల కోసం ప్రతిపాదించామని, జిల్లా కలెక్టర్‌కు నివేదించామన్నారు. ఆ భూమిలో ప్రభుత్వ ఫెన్సింగ్‌ని ధ్వంసం చేసి ఆక్రమణకు పాల్పడ్డ వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని గౌతమ్‌కుమార్ హెచ్చరించారు. కొంతమంది భూకబ్జాదారులు ప్రేరేపిస్తే అమాయక ప్రజలు వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి, ఎస్ఐ నాగరాజు, మండల గిర్దావర్ నహీదా బేగం, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మతతత్వ రాజకీయాలు దేశ భవితకు ముప్పు

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్



మాట్లాడుతున్న వినోద్‌కుమార్,



సంఘీభావం తెలుపుతున్న వివిధ పార్టీల నేతలు, సభ్యులు

**మన్సూరాబాద్:** మతతత్వ రాజకీయాలు దేశ భవిష్యత్‌కు పెనుముప్పును కల్గిస్తాయమని.. శాంతికి విఘాతం కలుగుతుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం తెలంగాణ రాష్ట్ర తృతీయ మహాసభను మన్సూరాబాద్ డివిజన్ గణేష్‌నగర్ కాలనీలోని ఎం గ్రాండ్ హోటల్‌లో శనివారం నిర్వహించారు. సంఘం జాతీయ అధ్యక్షుడు కె.యాదవరెడ్డి శాంతి పతాకాన్ని ఆవిష్కరించగా, జాతీయ ఉప ప్రధాన కార్యదర్శి హరిచండొంగ్ భట్ మహాసభను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వినోద్‌కుమార్ మాట్లాడుతూ... ప్రధానీ నరేంద్రమోడీ మతతత్వ విధానాలతో దేశ సారభౌమ, లౌకిక, సామ్యవాద ప్రజాస్వామ్యానికి తీవ్రమైన ముప్పు ఏర్పడిందన్నారు. సమాజంలోని అన్ని మతాలు, సంస్కృతులు, సామరస్యంతో జీవించటానికి మన రాజ్యాంగం వీలు కల్పించిందని తెలిపారు. దేశంలో మతపరమైన హింసలు రోజురోజుకు పెరుగుతున్నాయని, ఇది ప్రజాస్వామ్యానికి మంచి సంకేతం కాదని ఆందోళన చెందారు. అంతర్గతంగా, బహ్యంగా దేశాన్ని రక్షించడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. శాంతి, సామరస్యం లేకుంటే రాజకీయ బలం, ఆర్థిక స్థిరత్వం, సాంస్కృతిక ఎదుగుదల అసాధమన్నారు. సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీఎల్ స్వాగతం పలుకగా, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కాచం సత్యనారాయణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాలకంటి రంగారెడ్డి, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి బోమ్మగాని ప్రభాకర్, సంఘం నేతలు డాక్టర్ దిడ్డి సుధాకర్, అరుణ్‌కుమార్, తిప్పర్తి యాదయ్య, మెట్ల జగన్, రఘుపాల్, ఓబైదుల్లా కొత్వాల్, నాగేశ్వర్‌రావు, జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీని మరింత బలోపేతం చేయాలి: సామ



సమావేశంలో పాల్గొన్న సామ తదితరులు

**చంపాపేట:** బీజేపీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా కృషి చేయాలని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. శనివారం బీఎన్‌రెడ్డి డివిజన్ పరిధిలోని ఏఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, పార్టీ అధ్యక్షుడు నవకిషోర్‌రెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో పార్టీ శక్తి కేంద్ర ఇంచార్జి, బూత్ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రంగారెడ్డి మాట్లాడుతూ... బీజేపీకి కార్యకర్తలే ఆయువు పట్టన్నారు. రానున్న శాసనసభ ఎన్నికలలో ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలో బీజేపీ జండా ఎగుర వేయటం ఖాయమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థిని అధిక మెజారిటీతో గెలిపించేందుకు బూత్ కమిటీ సభ్యులు ప్రణాళిక సిద్ధం చేయాలని మొద్దు లచ్చిరెడ్డి కోరారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యువడు వనపల్లి శ్రీనివాసరెడ్డి, నాయకులు భూపాల్‌రెడ్డి, రఘురాంనేత, నర్సింహారెడ్డి, శంకరయ్య, సందీప్, సంతోష్, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డెంటల్ ఆస్పత్రి ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, పక్కన కార్పొరేటర్లు

**మలక్‌పేట:** ఏరంగంలోనైనా సేవాదృక్పదంతో పని చేసినప్పుడు ప్రజలు ఆదరిస్తారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. బీజేపీ కార్పొరేటర్లు కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, శ్వేతా మధుకర్‌రెడ్డిలతో కలిసి ఆమె మూసారంబాగ్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన అరుణ డెంటల్ ఆస్పత్రి, ఇంప్లాంట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అత్యాధునిక టెక్నాలజీతో ప్రజలకు డెంటల్ సేవలు అందుబాటులోకి తీసుకరావడం సంతోదాయకమన్నారు. ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ కార్తీక్‌రెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, కోశాధికారి రమేష్‌రెడ్డి, మలక్‌పేట కన్వీనర్ నవీన్‌రెడ్డి, నర్సింహా, రాంకోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆలోచింపజేసిన వైజ్ఞానిక ప్రదర్శన



సైన్స్ ఫెయిర్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, కరస్పాండెంట్ హిజ్కియా



నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

**మలక్‌పేట:** విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయడానికి దోహదపడతాయని క్రిస్టియన్ ఎమ్మెల్సీ డి.రాజేశ్వర్‌రావు అన్నారు. అక్బర్‌బాగ్ డివిజన్ ప్రొఫెసర్స్ కాలనీలోని సెయింట్ జేవీయర్స్ హైస్కూల్లో శనివారం నిర్వహించిన సైన్స్‌ఫెయిర్–2023ను ఎమ్మెల్సీ ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన నమూనాలు తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కొత్త అంశాలు తెలుసుకోవడానికి ఆసక్తి చూపాలన్నారు. చదువుతో పాటు ప్రపంచంలో జరుగుతున్న విషయాల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. 100 నమూనాలు ప్రదర్శించగా.. వాటిలో ఎన్విరాన్‌మెంట్, ట్రాఫిక్, ఆర్ట్‌గ్యాలరీ, సోషల్, మ్యాథ్స్ సబ్జెక్ట్‌లకు సంబంధించిన నమూనాలు ఆకట్టుకున్నాయి.

## రైతుల సంక్షేమానికి పాలకవర్గం కృషి చేయాలి



హమాలీలకు దుస్తులను పంపిణీ చేస్తున్న అజంఅలీ

**చాదర్‌ఘాట్:** మార్కెట్‌కు వచ్చే రైతుల సమస్యలు పరిష్కరించవలసిన బాధ్యత మార్కెట్ పాలకవర్గంపై ఉందని బీఆర్‌ఎస్ మలక్‌పేట ఇన్‌చార్జ్ అజంఅలీ సూచించారు. శనివారం మలక్‌పేటలోని వ్యవసాయ మార్కెట్‌లో పాలకవర్గం ఏర్పాటు చేసిన కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ భూమేష్, డైరెక్టర్ రవికాంత్, ఎస్జీఎస్ దామోదర్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కూరగాయల ధరలు

**వనస్థలిపురం:** సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 17, వంకాయ 23, బెండ 55, పచ్చి మిర్చి 35, కాకర 37, బీర 45, క్యాబేజి 9, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 18, దొండ 28–33, చిక్కుడు 45, గోకర 40, బీట్‌రూట్ 15, క్యాప్సికం 50, ఆలు 19, దోస 23, సొర 15, పొట్ల 18, ఉల్లి 16. చామగడ్డ 70 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.







**CAUTION NOTICE**

It is informed to the general public at large that my Client Adavikolanu Seshagiri Rao S/o. Late Smt. Sarayu Rao, is the sole, Surviving legal heir of Late Smt. Sarayu Rao, and by virtue of succession had inherited and become the joint owner of the below mentioned undivided properties.

**SCHEDULE OF PROPERTIES:**

1. i) Uppal Village and Mandal, Sy.No.409, extent Ac. 0-33 gts.
   ii) Uppal Village and Mandal, Sy.No.410, extent Ac. 8-37 gts.
   iii) Uppal Village and Mandal, Sy.No.346, extent Ac. 4-02 gts.
   iv) Uppal Village and Mandal, Sy.No.446, extent Ac. 1-10 gts.
   v) Uppal Village and Mandal, Sy.No.447, extent Ac. 1-17 gts.
2. Malkajgiri, Sy.No.163, 164, 166, 58, 26, 209, 210, 211, extent Ac. 42-10 gts.
3. i) Nagole Village, Uppal Mandal, Sy.No.5, extent Ac.16-00 gts.
   ii) Nagole Village, Uppal Mandal, Sy.No.220, extent Ac.105-17 gts.

It has come to notice that some illegal transactions have taken place with regard to the above mentioned properties by some unauthorized people and also are trying to deal in the same properties without any right or title. It is cautioned to the general public at large and particularly to people who intends to deal with unauthorized persons with regard to the above properties now, to refrain from indulging into or entertaining the thoughts of dealing with the above mentioned properties. And it is made known to the general public that the above mentioned properties are joint Hindu Family properties and have not yet been partitioned legally amongst the legal heir and my client has taken steps to get the properties partitioned legally amongst the legal heirs through court. Therefore it is cautioned that anybody dealing with the above mentioned properties would be doing so at their own peril and would be held for all the consequences arising thereof.

K.R. Dasaratha Raj
Advocate
No.13, Ashish Apts, near Bharath Petrolbunk, East Marredpally, Secunderabad, Telangana. Cell: 9849358113, 9849005215
Date: 11-02-2023

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 | 9912220363
9505507616 | 9912220365